## క్లుప్తంగా

### 25న కేశవస్వామి ఆలయ పునః ప్రతిష్ఠ



దొడ్డనపూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయం

**కాళ్ల:** మండలంలోని దొడ్డనపూడి గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కేశవ స్వామి వారి ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమం ఈనెల 25వ తేదీన నిర్వహించినట్లు ఆలయ ఈవో శ్రీనివాసరాజు గురువారం తెలిపారు. దీనిలో భాగంగా గురువారం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. 25వ తేదీన ఉత్తర నక్షత్ర యుక్త మేష లగ్నం అందు ప్రతిష్ఠ హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

### విద్యార్థులకు నైపుణ్యంపై అవగాహన అవసరం



విద్యార్థులతో మాట్లాడుతున్న సెట్‌వెల్ సీఈవో మెహరాజ్

**భీమవరం:** విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యంపై అవగాహన కలిగి ఉండాలని సెట్‌వెల్ సీఈవో మహ్మద్‌హిచ్ మెహరాజ్ అన్నారు. భీమవరం ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర యువజన సర్వీసుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యక్తిత్వ అభివృద్ధి-వికాసం-నైపుణ్యం అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మానసిక శాస్త్ర నిపుణుడు ఎ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ వికెజె ప్రసూన, యువజన సర్వీసులశాఖ మేనేజర్ పీవీ సత్యనారాయణ, ఏవో కె జాన్‌కెనడీ, పి అరవింద్ స్వామి, ఎస్‌డీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీకి అండగా కాపులు



ముద్రగడ పద్మనాభంను కలిసిన జిల్లా కాపు సంఘం నాయకులు

**ఆకివీడు:** కాపు సామాజిక వర్గానికి అండగా ఉంటున్న వైఎస్సార్ సీపీ విజయానికి కాపు కాస్తామని జిల్లా కాపునాడు అధ్యక్షుడు వెంకటరాయుడు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్, కాపునాడు జిల్లా సీతారామయ్య చెప్పారు. ఇటీవల వైఎస్సార్ సీపీలో చేరిన ముద్రగడ పద్మనాభం మర్యాదపూర్వకంగా కలిసి గురువారం ఆయన నివాసంలో అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వాలు కాపుల్ని అడ్డుపెట్టుకొని రాజకీయం చేశాయని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపులకు సముచిత స్థానం కల్పిస్తూ మంత్రివర్గంలో, ఇతర నామినేటెడ్ పదవులు కేటాయింపులు న్యాయం చేకూర్చారని తెలిపారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యేందుకు కాపులంతా ఐక్యంగా కాపు కాస్తామని ఆయన పేర్కొన్నారు.

### నేడు ఉండిలో గడపగడపకు మన ప్రభుత్వం

**ఉండి:** మండలంలోని చిక్కాల వీరన్న నగర్‌లో శుక్రవారం సాయంత్రం 3 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన తెలిపారు.

### వృత్తి నైపుణ్య ఉచిత శిక్షణకు దరఖాస్తు స్వీకరణ

**ఆకివీడు:** వృత్తి నైపుణ్య ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండలంలోని దుంపగడప వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులకు సువర్ణావకాశం కల్పిస్తూ నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. డేటా ఎంట్రీ కోర్సు, టైలరింగ్‌లో మహిళలకు 3 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి అయిన అనంతరం ప్రభుత్వం గుర్తింపుతో సర్టిఫికెట్ అందజేస్తారని చెప్పారు.

### ముమ్మరంగా ఉపాధి పనులు

**మొగల్తూరు:** మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాళీపట్నం తూర్పు, కేపీ పాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, మొగల్తూరు పంచాయతీలోని నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం, పాలకమ్మచెరువు, శేరేపాలెం గ్రామాల్లో పంట బోదె తవ్వకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. గురువారం మండలంలోని కాళీపట్నం తూర్పులో చేపట్టిన పంటబోదె పనులతో పాటు కూలీల మస్టర్లను జేఈ ఆనంద్ ఉపాధి కూలీలకు పలు సూచనలు చేశారు.

# గ్రామాల్లో వ్యవసాయ విప్లవం

- ప్రభుత్వ సహాయ సహకారాలన్నీ గ్రామంలోనే
- వేగంగా ఆర్బీకే భవన నిర్మాణాలు
- పెట్టుబడి సాయంతో పెరిగిన రైతు పరపతి



పాలకోడేరు మండలం గొరగనమూడి రైతు భరోసా కేంద్రం

**పాలకోడేరు:** రైతే రాజు అనేది దశబ్దాలుగా నెరవేరని నినాదంలా ఉండిపోయింది. కానీ ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో దివంగత మహానేత డాక్టర్.వై.ఎస్.రాజశేఖరరెడ్డి నిజం చేసి చూపించారు. అదే వరవడిలో మరోనాలుగడుగులు ముందుకేసి దేశం యావత్తూ మన రాష్ట్రం వైపు చూసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు అండగా నిలుస్తున్నారు. రాష్ట్రంలో ఆయన నేతత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు భరోసా పేరుతో రైతులకు పెట్టుబడి సాయం అందజేస్తున్నారు. రైతులను వ్యవసాయ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఆశయంతో వ్యవసాయ సిబ్బందిని, వ్యవసాయ గ్రంథాలను అందుబాటులో ఉంచుతూ రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు రైతులకు అండగా ఆసరాగా నిలుస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా కింద ఈ ఏడాది మండలంలోని 4093మంది రైతులకు రూ.5.52కోట్లు సాయం అందజేశారు. యంత్ర సేవా పథకం క్రింద 18గ్రూపులకు (90మంది రైతులకు)రూ. 2.72 కోట్లు విలువ గల యంత్రాలు రూ.98 లక్షల సబ్సిపై అందించడం జరిగింది.

**గ్రామ స్థాయిలోనే రైతులకు అండగా...**

గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఏ చిన్న అవకాశం వచ్చిన రైతులు మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారి కార్యాలయానికి పరుగులు పెట్టాల్సి వచ్చేది. నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామ స్థాయిలోనే రైతుల వద్దకు అవసరమైన అన్ని సేవలు వచ్చి చేరాయి. పాలకోడేరు మండలంలోని 14గ్రామాల్లో 18ఆర్‌బీకేలు ఉన్నాయి. వీటిలో కొన్ని భవనాల నిర్మాణాలు పూర్తికాగా, మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణాలు ప్రగతిలో ఉన్నాయి. వీటి ద్వారా రైతులకు విత్తనం అందించడం నుంచి పండిన పంట కొనుగోలు వరకు వ్యవసాయ సహాయకులు అండగా ఉంటున్నారు. సాగులో సూచనలు, సలహాలు అందించడంతో పాటు ఈ-క్రాఫ్ నమోదు, పంట నష్టం వస్తే వెంటనే అంచనా వేసి ఇన్‌పుట్ సబ్సిడీ అందించి చర్యలు తీసుకుంటున్నారు. ఆర్‌బీకేల్లో సిబ్బంది రైతులకు అవసరమైన వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సకాలంలో రాయితీపై అందిస్తున్నారు. భూసార పరీక్షలు చేయించడం, పంట బీమా వంటి చేపడుతున్నారు. పశువుల బీమా, వైద్య సహాయం, వాటికి కావాల్సిన సంపూర్ణ దాణా వంటి సేవలు అందించడంలో ఆర్బీకేలు విశేష సేవలు అందిస్తూ పాడి రైతులకు కూడా అండగా నిలుస్తున్నాయి.

### మాట నిలుపుకొన్నారు



ప్రజా సంకల్పయాత్రలో రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని జగనన్న మాటిచ్చాడు. ఆమాట ప్రకారం గత నాలుగేళ్లగా ఆర్థిక సాయం అందజేశారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభానికి ముందుగానే రైతుల ఖాతాలకు జమ చేశారు. రైతుల కష్టాలు తెలుసుకుని సాగుకు పెట్టుబడి సాయం అందిస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్‌కింద ఏటా రైతులకు అందిస్తున్న రూ.18, 000 పెట్టుబడి సాయం ఎంతగానో ఉపయోగపడుతుంది.

– కొత్తపల్లి కాశీ విశ్వనాథ రాజు, వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, పాలకోడేరు

### సబ్సిడీపై వరికోత యంత్రం తీసుకున్నాం



మా గ్రామంలో రూ.24లక్షలతో వరి కోత యంత్రం తీసుకున్నాం. దీనికి ప్రభుత్వం రూ.8లక్షల సబ్సిడీ అందజేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండగ చేశారు. ఆకాల వర్షాల్లో పంట నష్టపోయిన రైతులకు స్థానిక నాయకులు సహకారంతో సకాలంలో నష్టపరిహారం అందించారు.

– తంగెళ్ల సత్యనారాయణ, రైతు గొల్లల కోడేరు

### ఆకట్టుకున్న రథోత్సవాలు

**యలమంచిలి:** మండలంలోని ఏనుగువానిలంక గ్రామంలో పార్వతీ మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి ఆలయ అర్చకులు కామలింగశాస్త్రి, సురేంద్రశర్మ బ్రహ్మత్వంలో దేవేరులకు కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కాకుమళ్ల ఆంజనేయులు దంపతులు పార్వతీ మల్లేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణం అనంతరం గురువారం రథోత్సవం నిర్వహించారు. శివాలయం నుంచి ప్రారంభమైన రథోత్సవం గ్రామ ప్రధాన వీధుల మీదుగా సాగి మళ్లీ శివాలయానికి చేరుకుంది. రథోత్సవం జరుగుతున్న సమయంలో స్వామిని దర్శించుకున్న పాలకొల్లు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కొంత సమయం రథం లాగి స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని ఐదవ రోజున అన్నసమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ చైర్మన్ కాకుమళ్ల ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో యడ్ల తాతాజీ, వినుకొండ రవి, బళ్ల నాగేశ్వరరావు, పెచ్చెట్టి కృష్ణాజీ, గొలికారి తాతాజీ వెంకట నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

**పాలకొల్లులో..**

**పాలకొల్లు అర్బన్:** మండలంలోని దిగమర్రులో ఉన్న శ్రీ ఉమాసోమేశ్వర స్వామివార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం గ్రామంలో రథోత్సవం నిర్వహించారు. కల్యాణ మూర్తుల ప్రతిమలను రథంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో యాళ్ల సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# అభివృద్ధి, సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

**ఉండి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు**



ఉండి కొత్తపేటలో ఉండి కాలువపై నిర్మిస్తున్న వంతెన పనులు పరిశీలిస్తున్న పీవీఎల్ నర్సింహరాజు, తదితరులు

**ఉండి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ప్రజలు జై కొడుతున్నారని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. గురువారం ఉండిలో పార్టీలో పలువురికి చేరికల సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాల ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో చదవులు విప్లవంతో తీసుకువచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేశారన్నారు. అందుకే భవిష్యత్ మరింత బాగుండాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రి చేయాలని కోరారు. పొరపాటున చంద్రబాబుకు అతని మిత్రులకు ఓటువేస్తే రాష్ట్ర భవిష్యత్ అంధకారం అవుతుందని అన్నారు. అధికారం కోసం మాట ఇవ్వడమే తప్ప దానిని ఎప్పుడూ చంద్రబాబు నెరవేర్చలేదన్నారు. రాబోయే రోజుల్లో జగన్‌మోహన్‌రెడ్డి మంచి మ్యానిఫెస్టోతో ప్రజల ముందుకు రాబోతున్నారని అన్నారు. అందుకే ఈసారి ఉండిలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, దానికి సంకేతమే కొత్త ఓటర్లు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని పీవీఎల్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గమహంకాళి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరరావు, రాష్ట్ర జానపద కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, పాకలపాటి రామరాజు, కరిమెరక మల్లికార్జున, కరిమెరక శివనాగరాజు, కోళ్ళపల్లి సతీష్‌రాజు, రాయి సతీష్, గెద్దా భోగేశ్వరరావు, చిట్టూరి రత్నరాజు, అంగర రాంబాబు, శేషాద్రి శ్రీను,బడుగు బాలాజీ, ముదునూరి అప్పలరాజు, యేడిద నెహ్రూ, బూసి వాల్టర్‌లాల్, ఆనందరావు పాల్గొన్నారు.

**వంతెన నిర్మాణ పనుల పరిశీలన**

**ఉండి:** మండలంలోని కొత్తపేటలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.10 లక్షలతో ఉండి కావులపై నిర్మాణం చేపట్టిన వంతెన పనులను గురువారం చేపట్టిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పరిశీలించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని తెలిపారు. అభివృద్ధిని చూసి ప్రజలు ఓటేయాలని కోరారు. ప్రతిపక్షాల మాయ మాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గమహంకాళి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరరావు, రాష్ట్ర జానపద కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, కరిమెరక మల్లిఖార్జున, కరిమెరక శివనాగరాజు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీలో చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన ఆటోవర్కర్స్ యూనియన్ సభ్యులకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

**భీమవరం:** పట్టణంలోని ఆటో వర్కర్స్ యూనియన్ సభ్యులు గురువారం రాత్రి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో ఆయన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా భీమవరంలో గతంలో పోటీచేయడంతో అనేకమంది యువత ఆయన వెంట నడిచారని ప్రస్తుత పరిస్థితుల్లో మార్పులు కారణంగా అప్పట్లో జనసేనకు పనిచేసిన వారంత తనపై నమ్మకంతో వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని చెప్పారు. 2014 ఎన్నికల్లో తాను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేయగా తన గెలుపునకు కృషి చేసిన యువత అనేకమంది 2019లో పవన్‌కళ్యాణ్ భీమవరంలో పోటీ చేయడంతో పవన్ ముఖ్యమంత్రి అవుతారనే ఆశతో అప్పటి వరకు తన వెంట ఉన్న యువత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా నిలిచారన్నారు. రానున్న ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ భీమవరం నుంచి పోటీ చేయకపోవడంతో పాటు గత ఐదేళ్లగా నియోజకవర్గంలో తానుచేసిన అభివృద్ధితో తిరిగి యువత సొంత గూటికి వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జట్ల రాంబాబు, పతివాడ రాజేంద్ర, పోతుల చక్రి, తోట బాలాజీ, విజ్జురోతి వెంకటరమణ, ఇంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌పై అవగాహన సదస్సు



క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ కె.సుజాత

**ఆకివీడు:** ముందు జాగ్రత్త చర్యలతో క్యాన్సర్‌ను నివారించవచ్చునని ప్రిన్సిపాల్ కె.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని బోస్ కాలనీలో ఎన్ఎస్ఎస్ శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో అధికంగా గర్భసంచి, బ్రస్టు, బ్లడ్, గొంతు క్యాన్సర్‌లు వస్తాయని వివరించారు. పరిశుభ్రతతో, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలన్నారు. కెమిస్ట్రీ అధ్యాపకురాలు ఏ.ఇందిర మాట్లాడుతూ క్యాన్సర్ కు మందులేదని, నివారణే మార్గమన్నారు. క్యాన్సర్ లక్షణాల్ని గుర్తించి వెంటనే వైద్యం పొందాలన్నారు. క్యాన్సర్ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే ప్రాణాపాయం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పీ.అనిల్‌సాయి, ఎన్ఎస్ఎస్.కోఆర్డినేటర్ కె.ఆనందకుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీ ద్వారానే పేదల అభ్యున్నతి



చెరుకువాడలో నర్సాపురం వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను సత్కరిస్తున్న సర్పంచ్ సాంబశివరావు, తదితరులు

**ఉండి:** వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ద్వారానే పేదల అభ్యున్నతి సాధ్యమవుతుందని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని నర్సాపురం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల కోరారు. శుక్రవారం అలుగులమ్మ జాతర మహోత్సం పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దంపతులను కమిటీ పెద్దలు,సర్పంచ్ ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక న్యాయం అనే మాటను చాలాసార్లు విన్నాంగాని జగనన్న పరిపాలనలోనే అది నిజరూపం దాల్చిందని అన్నారు. ఎందుకంటే కలలో కూడా అనుకోని అవకాశాన్ని వెనుకబడిన తరగతిలో బీసీ మహిళనైన నాకు ఇంత గొప్ప అవకాశాన్ని ఇచ్చిన గొప్ప నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ధనబలం, రాజకీయ అండదండలు ఉండే వారిని మాత్రమే ప్రతిపక్షాలు అభ్యర్థులుగా ఎన్నిక చేస్తుంటే జగనన్న మాత్రం తన అక్కచెల్లెమ్మలను గౌరవిస్తూ ఆయన తీసుకునే నిర్ణయాలు అత్యంత అద్భుతంగా ఉంటున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండవేటి సాంబశివరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నడింపల్లి కృష్ణంరాజు, కమిటీ పెద్దలు యర్రికి బుజ్జి, చిట్టిబొమ్మల నర్సింహస్వామి, డాక్టర్ గణేష్, బాలాజీ తదితర వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కాళ్ల:** మండలంలోని 33/11 కె.వి విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో 11 కెవి లైన్లు మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు పనులు కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటలు నుంచి మధ్యాహ్నం 1గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ గురువారం తెలిపారు. కాళ్లకూరు, దొడ్డనపూడి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ఆశాజనకంగా దాళ్వా సాగు

**మొగల్తూరు:** సాగు పనులు ఆలస్యంగా చేపట్టినా దాళ్వా సాగు ఆశాజనకంగా ఉంది. ప్రతి ఏటా జనవరి నెలాఖరుకు నాట్లు వేయడం పూర్తి కాగా ఈ ఏడాది వాతావరణం కారణంగా ఫిబ్రవరి నెల వరకూ నాట్లు వేస్తూనే ఉన్నారు. మొగల్తూరు మండలంలో సుమారు 1190 ఎకరాల్లో దాళ్వా నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారు. రైతులు ఎక్కువగా 125 నుంచి 140 రోజుల్లో పంట చేతికోచ్చే 1121, 1156, 1153, పీఆర్-121 రకం విత్తనాలను వినియోగంచడంతో అందుకు అవసరమయ్యే ఎరువులు, పురుగు మందు లు అందుబాటులో ఉంచామని అధికారులు పేర్కొంటున్నారు. రైతుభరోసా కేంద్రాల్లోని సిబ్బంది రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని ఏఓ రహీమ్ తెలిపారు.

### నేటి నుంచి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం ప్రారంభం



గ్రంధి శ్రీనివాస్

**భీమవరం:** ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం నుంచి మే నెలలో నిర్వహించే అసెంబ్లీ ఎన్నికలకుగాను ఎన్నికల ప్రచార శంఖారావం పూరించనున్నారు. ఆయన ప్రతి ఎన్నికల సమయంలో సెంట్‌మెంట్‌గా పట్టణంలో మావుళ్లమ్మ అమ్మ ఆయలం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించే ఎన్నికల ప్రచారం ప్రారంభించడం ఆనవాయితీ. దీనిలో భాగంగానే శుక్రవారం ఉదయం 7 గంటలకు పూజలు ప్రారంభించి ఎన్నికల సమరశంఖాన్ని పూరించడానికి ఏర్పాట్లు చేశారు. గడిచిన ఐదేళ్లగా కాలంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లడమేగాక నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిచేయడం ద్వారా ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. భీమవరం పట్టణాన్ని జిల్లా కేంద్రంగా చేయడానికి మంత్రి పదవిని సైతం వదులుకున్నారని స్వాక్షాత్తు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పబ్లిక్ మీటింగ్‌లో ప్రకటించడమేగాక శ్రీనన్న రియల్‌హీరోగా సంభోదించడంతో శ్రీనివాస్ కీర్తి మరింత పెరిగింది. ఇటీవల కాలంలో జనసేన, టీడీపీలకు చెందిన వేలాదిమంది నాయకులు, కార్యకర్తలతోపాటు పవన్‌కల్యాణ్ అభిమానులు సైతం వైఎస్సార్ సీపీలో చేరుతుండడంతో వైఎస్సార్‌సీపీ బలం మరింత పెరిగింది.



# జగనన్న పాలనలో బీసీలకు ప్రాధాన్యం



భీమవరంలో గూడూరి ఉమాబాలకు పుష్పగుచ్ఛం అందిస్తున్న బాలకృష్ణ, మంగరాజు తదితరులు

**భీమవరం:** నరసాపురం పార్లమెంట్ టికెట్‌ను తొలిసారిగా బీసీ మహిళకు ఇవ్వడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నమండ బాలకృష్ణ అన్నారు. గురువారం భీమవరంలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలను మర్యాదపూర్వకంగా కలిపి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ గతంలో ఎన్నడులేని విధంగా ఏలూరు, నరసాపురం పార్లమెంట్ టికెట్స్‌ను బీసీలకు ఇవ్వడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బీసీ పట్లచూపుతున్న మమకారానికి నిదర్శనమన్నారు. బీసీలంతా ఐక్యమత్యంగా వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు, ఏసుపాదం, పాల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా వెంకన్న కల్యాణం

**పాలకొల్లు సెంట్రల్:** స్థానిక కెనాల్ రోడ్డు గాంధీ బొమ్మల సెంటర్ వద్ద కొలువై ఉన్న శ్రీ భూ నీళా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి తిరు కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి గోవర్ధనం శోభనాద్రి ఆచార్యుల బ్రహ్మత్వంలో గ్రంధి మురళీకృష్ణ దంపతులు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### దళిత సమస్యలపై వినతి

**భీమవరం:**భీమవరం పట్టణంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి మెట్లతోపాటు విద్యుత్ అలంకరణ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఎస్సీ కమీషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్‌ను కోరినట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు చెప్పారు. ఈ సందర్భంగా విజయవాడలో విక్టర్‌ప్రసాద్‌ను జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ కలసి ఈ మేరకు వినతిపత్రం అందజేశామన్నారు. అలాగే పెంటపాడు మండలం ఆకుతీగపాడులోని స్మశాన వాటిక ఆక్రమణకు గురైందని, డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదని గ్రామ సర్పంచ్, కార్యదర్శి దళితులను వివక్షకు గురి చేస్తున్నారని పిర్యాదు చేసినట్లు తెలిపారు. వీటిని సానుకూలంగా స్పందించిన విక్టర్‌ప్రసాద్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు మంగరాజు తెలిపారు.

### గ్రామాల్లో పోలీసుల కవాతు

**నరసాపురం రూరల్:** సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సీఐ కె.గోవిందరాజు, ఎస్సై గుర్రయ్య అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా లిఖితపూడి, సరిపల్లి గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. సరిపల్లి గ్రామ సెంటర్ నుంచి ప్రధాన రహదారి మీదుగా ఈ పోలీసు కవాతు కొనసాగింది. అనంతరం సరిపల్లి సెంటర్ నిర్వహించిన సభలో సీఐ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది జర్నైల్ సింగ్, రామన్‌జీ తదితరులు పాల్గొన్నారు.